ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
గురువారం 24 ఏప్రిల్ 2025



ఏసీబీ వలలో
విద్యుత్ శాఖ ఏఈ
● రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
7

భానుడి
భగభగ



మహబూబ్‌నగర్‌లో మధ్యాహ్నం వేళ ఎండ వేడికి స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న మహిళ

పాలమూరు, నారాయణపేట జిల్లాల్లో ఎండలు రోజురోజుకు ముదురుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఎండలు మండుతున్నాయి. మహబూబ్‌నగర్‌లో ఉష్ణోగ్రతలు మూడు రోజులుగా 41 డిగ్రీలు దాటుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలు ఉండటంతో తేమ శాతం తగ్గి, ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కరెంటు లేకపోతే ఇళ్లలో క్షణం కూడా ఉండలేకపోతున్నారు. ఫ్యాన్ నుంచి వేడిగాలి వస్తుండటంతో ఏసీలు వేసుకునే వాళ్లకు కరెంట్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు పైన ఎండ.. కింద తారు రోడ్డు సెగతో ఇబ్బంది పడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు వడగాల్పులకు గురవుతున్నారు. నారాయణపేట జిల్లాలో బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీలు నమోదైంది. మరో రెండు నెలలపాటు వేసవి తిప్పలు తప్పేలా లేవు.

- మహబూబ్‌నగర్/ నారాయణపేట



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తా



పేటలో ఎండలో మహిళ పాట్లు



మహబూబ్‌నగర్‌లో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఉష్ణోగ్రతలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా పెబ్బేరులో 42.7, మహబూబ్‌నగర్ జిల్లాలో 41, నాగర్‌కర్నూల్ జిల్లాలో 39, నారాయణపేట జిల్లాలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిర్మానుష్యంగా భూత్పూర్ జాతీయ రహదారి



పాలమూరులో రోడ్డు పక్కన గొడుగు పట్టుకొని జామకాయలు అమ్ముతున్న మహిళ



పేటలో స్కూటీపై వెళ్తూ కర్చీఫ్ ధరించిన యువకుడు



పేటలో తాటిముంజలు కొనుగోలు చేస్తున్న మహిళ



పేటలో ఎండలతో తగ్గిన జనం రద్దీతో ప్రధాన రోడ్డు



నారాయణపేటలో పుచ్చకాయలు కొనుగోలు చేస్తున్న జనం, ఎండలోనే వాటిని అమ్ముతున్న మహిళ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

కొండ ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్ర
నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

భూత్పూర్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయడానికి కుట్ర పన్నిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. వివరాలను ఎస్పీ జానకి బుధవారం భూత్పూర్ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. 2015లో కొండా ప్రశాంత్‌రెడ్డి అరుణాచలం రాజును హత్య చేసిన కేసులో ఏ2 నిందితుడుగా ఉన్నాడు. ఇదిలా ఉండగా, మహబూబ్‌నగర్ మండలంలోని తిమ్మసానిపల్లి గ్రామానికి చెందిన కాట్రావత్ గోపినాయక్ వద్ద కొండా ప్రశాంత్‌రెడ్డి ఇటీవలే రూ.40 వేల విలువ చేసే ఇటుకలను కొన్నాడు. ఆ డబ్బులు ఇవ్వాలని గోపినాయక్ కుమారుడు రూప్‌సింగ్ పలుమార్లు ప్రశాంత్‌రెడ్డిని అడిగాడు. డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని రూప్‌సింగ్ మనస్సులో పెట్టుకొని, ప్రశాంత్‌రెడ్డిని ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ విషయాన్ని అరుణాచలం నవీన్‌కుమార్‌తో చెప్పాడు. అందుకు నాకు రూ.5 లక్షల సుపారీ కావాలని అడిగాడు. ప్రశాంత్‌రెడ్డి తన తండ్రిని చంపాడని మనస్సులో పెట్టుకొని, రూ.లక్ష ఇస్తానని నవీన్‌కుమార్ చెప్పాడు. ఒప్పుకున్న రూప్‌సింగ్ హత్య చేయడానికి మరో వ్యక్తి సహాయం కోసం స్నేహితుడైన శ్రీకాంత్(కర్ణాటక రాష్ట్రవాసి)ను కలిశాడు. ఇద్దరు కలిసి ప్రశాంత్‌రెడ్డి ఎక్కడెక్కడ తిరుగుతున్నాడు?, ఎలా చంపాలి అని రెక్కీ నిర్వహించారు. ఈ విషయాన్ని గమనించిన ప్రశాంత్‌రెడ్డి గతంలో అరుణాచలం రాజును హత్య చేసిన ఏ-3 నిందితుడు అయిన కుమ్మరి నర్సింహతో చర్చించాడు. కుమ్మరి నర్సింహ రూప్‌సింగ్‌తో హత్యకు సంబంధించి ఫోన్‌లో ఆరాతీశాడు. ఆ సంభాషణను రికార్డు చేసి, ప్రశాంత్‌రెడ్డికి చేరవేశాడు. దాంతో ప్రశాంత్‌రెడ్డి దేవరకద్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యకు ప్లాన్ వేసిన నిందితులు రూప్‌సింగ్, నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నేరాన్ని ఒప్పుకున్న వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఏ-3 నిందితుడైన శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. ఏ-4, ఏ-5 నిందితులు రాఘవేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌ను విచారిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక వాళ్లను కూడా అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, దేవరకద్ర ఎస్‌ఐ నాగన్న పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి
ప్రత్యేక చొరవ చూపాలి



జాదరావ్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

● పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూర్ ఆదర్శవంతం కావాలి
● నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

మద్దూర్, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జాదరావుపల్లిలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూర్ మండలం సమస్యల పరిష్కారంలో ఆదర్శవంతంగా ఉండేలా అధికారులు కష్టపడాలని సూచించారు. గ్రామానికి సంబంధించిన పహాణీ, పాత, కొత్త ఆర్‌వోఆర్, భూ రికార్డులను అధికారులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సదస్సుకు ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ అధికారులను అడిగారు. గ్రామంలో 26 దరఖాస్తులు, వాటిలో 14 అసైన్డ్ భూముల సమస్యలవే ఉన్నాయని చెప్పారు. మిగతా వాటిలో కొన్ని విరాసత్, మరికొన్ని పేరు మార్పిడివి ఉన్నాయని అధికారులు వివరించారు. గ్రామంలో 797 ఖాతాలు ఉన్నాయని డీటీ వాసుదేవరావు తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులపైనా కలెక్టర్ ఆరా తీశారు. అనతరం మద్దూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ఆర్‌ఐ జనార్ధన్‌గౌడ్, సర్వేయర్ అశోక్, రెవెన్యూ అధికారులు కమాలాకర్, ప్రకాశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి

కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాన్నీ పెంచేందుకు వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నీటి వాడకం, నియంత్రణ, సంరక్షణపై ఏర్పాటు చేసిన జిల్లా పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి సంరక్షణకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో 200 స్క్వేయర్ మీటర్, ఆపై అన్ని గృహాల్లో వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారా? అన్న దానిపై సర్వేచేసి, డేటా తయారు చేయాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మించే గృహాలకు అనుమతి మంజూరు చేసినప్పుడు ఆ శాఖ అధికారులు ఇంకుడు గుంత నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రాజకీయాలు కాదు..
భావితరాల భవిష్యత్ ముఖ్యం

● అందుకే విమర్శల జోలికి పోకుండా విద్యారంగ అభివృద్ధి కోసం కృషి
● రూ.17 కోట్లతో పూలే, అంబేడ్కర్ అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు
● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తనకు రాజకీయాలు ముఖ్యం కాదని.. భావితరాల భవిష్యత్ కోసం ఏం అందిస్తున్నామన్నదే ముఖ్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏం జరిగింది.. ఎలా జరిగిందనే విమర్శల జోలికి పోకుండా.. గతంలో చేపట్టిన పనులు, ఇప్పుడు ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించి మహబూబ్‌నగర్‌లో విద్యారంగం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఉచిత కోచింగ్, మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు, మాస్టర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, విద్యానిధిలాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా, అధికారులపై ఒత్తిడి తెచ్చి రూ.4 కోట్లు ఖర్చు చేసి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ చేపట్టారన్నారు. తాను 15 నెలలుగా కష్టపడి.. ఇంత అద్భుతమైన ప్రాంతంలో మార్కెట్ కంటే గ్రంథాలయం ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో అనుమతులతోపాటు రూ.17 కోట్ల నిధులు మంజూరుకు జీవో తెచ్చానన్నారు. మొదటి విడతలో రూ.10 కోట్లు, మిగతా నిధులు తర్వాత మంజూరు అవుతాయన్నారు. ఆంగ్లేయులు పాలించిన సమయంలోనే విద్య కోసం తన ఆస్తిని అమ్మి.. పాఠశాలలు నిర్మించిన పూలే, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వంటి మహనీయుల పేర్లతో పూలే అంబేడ్కర్ అంతర్జాతీయ స్థాయి విజ్ఞాన కేంద్రం నిర్మిస్తామని అన్నారు. అందులో లక్ష పుస్తకాలు ఉంచాలని సంకల్పంగా పెట్టుకున్నామన్నారు. అలాగే సెమినార్ హాల్, రీడింగ్ రూమ్స్, క్లాస్ రూమ్స్, డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. మెట్టుగడ్డ వద్ద ఉన్న డైట్ కళాశాల స్థలాన్ని బెదిరించి తీసుకుని, విద్యార్థులు ఆందోళన చేస్తున్నా వినకుండా అక్కడ టీడీ గుట్ట పేరుతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కోసం నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఇప్పుడు దానిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మార్చబోతున్నామని అన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్, మండల ఓబీసీ సెల్ చైర్మన్ రాజు గౌడ్, దేవేందర్ నాయకత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి సెలవులు

● జూన్ 13న పాఠశాలలు పునఃప్రారంభం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ముగియడంతో పాఠశాలలకు గురువారం నుంచి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మళ్లీ జూన్ 13న పాఠశాలలు తెరచుకోనున్నాయి. సెలవులు ఇవ్వడంతో వసతి గృహాల్లో ఉంటున్న వారు ఇటీ బాట పట్టారు. దాంతో మహబూబ్‌నగర్ బస్టాండ్ రద్దీగా మారింది. పాఠశాల చివరిరోజు బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, పిల్లలకు వచ్చిన మార్కులను వివరించారు. అన్ని పాఠశాలల్లో ప్రోగ్రెస్‌కార్డులను అందజేశారు. సెలవుల్లో విద్యా సంస్థలను నిర్వహించకూడదని విద్యాశాఖ ఆదేశించింది.

ఉగ్ర దాడిపై ఆగ్రహం

● కశ్మీర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన
● ఊరూరా కొవ్వొత్తులతో ప్రదర్శనలు
● అమరులకు నివాళి అర్పించిన నాయకులు
6



నారాయణపేటలో ఉగ్రవాదుల దాడిలో అమరులకు కొవ్వొత్తులతో నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మరణానికి రూ.6 వేలు

● ప్రసవానికి రూ. 3వేలు..
● ముడుపులు ఇస్తేనే బీమా డబ్బులు
● కార్మికశాఖలో ప్రతీ పనికి ఓ రేటు
● సొంతంగా వెళ్తే ఫలితం శూన్యం
● పైరవీకారుల ద్వారా వస్తేనే పనులు
6



కోయిలకొండలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న నాయకులు



జడ్చర్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, శ్రద్ధాంజలి ఘటిస్తున్న వివిధ పార్టీల నాయకులు



నారాయణపేట శిశుమందిర్‌లో మౌనం పాటిస్తున్న విద్యార్థులు

ఉగ్ర దాడిపై ఆగ్రహం

- కశ్మీర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన
- ఊరూరా కొవ్వొత్తులతో ప్రదర్శనలు
- అమరులకు నివాళి అర్పించిన నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నారాయణపేట/ నారాయణపేట న్యూటౌన్/ నర్వ/ కోయిలకొండ/ గద్వాల సర్కిల్/ గద్వాల టౌన్/ మరికల్/ మక్తల్/ జడ్చర్ల/ తెలకపల్లి/ నాగర్‌కర్నూల్ టౌన్/ బిజినేపల్లి/ కల్వకుర్తి/ పెద్దకొత్తపల్లి/ వనపర్తి విద్యావిభాగం/ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్, పహెల్గావ్ ఉగ్రదాడిపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబికింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా దుర్ఘటనకు నిరసనగా బుధవారం వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడి మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

● ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా బుధవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలో వివిధ పార్టీల నాయకులు, సంస్థల ప్రతినిధులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నేతాజీ చౌరస్తాలో మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు సంతాపం తెలిపారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

● నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

● నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండలోని వివేకానంద చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు కొవ్వొత్తులు వెలిగించి, మృతులకు నివాళి అర్పించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కాగడాలు, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్, ప్రవీణ్ సేవా సమితి ఆధ్వర్యంలో క్రీడాకారులు స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పీజీ కేంద్రం వద్ద అమరుల చిత్రపటాలకు విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంఘం నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో హిందూ సంఘాలు, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.

● తెలకపల్లి మండల కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

● బిజినేపల్లి మండల కేంద్రంలో హిందూ, ముస్లింలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పూలే అంబేడ్కర్ చౌరస్తాలో నివాళి అర్పించారు.

● కల్వకుర్తిలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ, బజరంగ్‌దళ్, హిందూవాహిని, ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

● పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో నివాళి అర్పించారు.

● వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు



వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకుల కొవ్వొత్తులతో ప్రదర్శన



కల్వకుర్తిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వీహెచ్‌పీ, వివిధ హిందూ సంఘాల నాయకులు



నర్వలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి



పెద్దకొత్తపల్లిలో నిరసన తెలుపుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు



గద్వాలలో కొవ్వొత్తులు, కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు



ఆలయ ప్రాంగణంలో జిల్లా న్యాయాధికారి ఎన్ ప్రేమలత, న్యాయవాదులు

అలంపూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, శక్తిపీఠం అలంపూర్‌ను బుధవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. గద్వాల జిల్లా నూతన న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రేమలత జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అలంపూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మిథున్ తేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులు, న్యాయవాదులు నారాయణరెడ్డి, సురేశ్‌కుమార్ పాల్గొన్నా రు. టీవీ సీరియల్ నటులు జాకీ, హరిత దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని పూజలు చేశారు. అంతకుముందు వారికి ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గణపతిపూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేశారు.



ఆలయ ప్రాంగణంలో జాకీ, హరిత దంపతులు

ఉగ్రవాద దాడిని సమాజం ఖండించాలి

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి

పాలమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడిని సమాజం ఖండించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదులు పర్యాటకుల మీద విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 26 మందిని బలి తీసుకున్నారని తెలిపారు. కశ్మీర్ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసినా, రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించినా, ఆర్టికల్ 370ని రద్దు చేసి భూములను, సహజవనరులను ఒపెన్ మార్కెట్‌గా మార్చినా కశ్మీర్‌లో ఇలాంటి దాడులు ఎందుకు జరుగుతున్నాయో దేశం ఆలోచించాలని పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరిగే సందర్భాల్లో ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

కాల్పుల విరమణ ప్రకటించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావో యిస్టు పార్టీ కాల్పుల విరమణ ప్రకటించి బస్తర్‌ను, ఆదివాసులను కాపాడాలని పాలమూరు అధ్యయన వేదిక (పీఏవీ) ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచా రి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వ బలగాలు హోంమంత్రి ఆదేశాలతో బస్తర్‌లో కాల్పులు జరుపుతున్నాయని తెలిపారు. కాల్పుల్లో మావో యిస్టులతో పాటు ఆదివాసీలు, వారి పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం, కాల్పులను విరమించి ఆదివాసీలను కాపాడాలని పీస్‌కమిటీ, భారత్ బచావో, పీయూసీఎల్‌తో పాటు, వందకు పైగా సంస్థలు కోరినట్లు పేర్కొన్నారు.

కాల్పులను విరమించి చర్చల్లో పాల్గొనేందుకు మావోయిస్టు పార్టీ సమ్మతి తెల్పిందన్నారు. ప్రభుత్వం కూడా కాల్పులను ఆపి ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమాజం ప్రజాస్వామిక శాంతిని కోరుకుంటు న్న దృష్ట్యా ఇరుపక్షాలు కాల్పులను విరమించాలని డిమాండ్ చేశారు. కర్రె గుట్టల నుంచి సైన్యాన్ని ఉపసంహరించాలని హోంమంత్రికి, ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి మనవి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభ చాటిన 'సీవీ రామన్' విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, అధ్యాపకులు

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సీవీ రామన్ విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చరణ్ తేజ 993, అర్షియా 993, రాధిక 992, టీసీ అక్షయ 992, విశ్వతేజ 992 మార్కులు సాధించారు. బైపీసీలో అక్షయ 988, మౌనిక 984, శ్వేత 982, నవ్య 982 మార్కులు సాధించారు. సీఈసీలో వెంకట్ 983 మార్కులతో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సానియా 467, శ్రావణి 465, తనుశ్రీ 464, సుకన్య 464, శ్రీహర్ష 463, ఐశ్వర్య 462, హేమలత 462, అక్షయ 462 మార్కులు సాధించారు. బైపీసీలో లక్ష్మీనారాయణ 435, మధుమోహన్‌రెడ్డి 431, ఎంఈసీలో నందిని 490, జ్ఞానేశ్వరి 485, సీఈసీలో వైష్ణవి 440 మార్కులతో రాణించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులను కరస్పాండెంట్ వీరయ్య, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి కుమారస్వామి, ప్రిన్సిపాల్ ప్రకాశ్, మల్లికార్జున్ అభినందించారు.

సత్తా చాటిన 'విజ్ఞాన్' విద్యార్థులు



విద్యార్థులతో విజ్ఞాన్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరా ఫలితాలలో విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీలో రేణుక 993, గాయత్రి 989, పావని 987, భార్గవి 987, ఉమేశ్వరి 984, మార్కులతో రాణించారు. బైపీసీలో శ్రావణి 968, అశ్విని 953, తన్మయి 952 మార్కులతో సత్తా చాటారు. సీఈసీలో అరుణకుమార్ 971 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో భవాని 466, అశ్విత 464, తేజశ్విని 458, ఎస్ఎండీ సోహెల్ 458, దివ్య 457 మార్కులు సాధించారు. సీఈసీలో గణేష్ 487, బైపీసీలో పావని 417 మార్కులతో సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజ్ఞాన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రాజేశ్, అధ్యాపకులు అభినందించారు.

బైక్ పైనుంచి కిందపడి వ్యక్తి మృతి



యాలాల మల్లయ్య (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన యాలాల మల్లయ్య(52) నాగర్‌కర్నూ ల్‌లోని సమీప బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు నాగపూర్ నుంచి బయలుదేరాడు. నాగనూల్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆ దారిలో వచ్చిన వారు గమనించి ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడు మల్లయ్య వద్ద ఉన్న ఫోన్ ద్వారా వారి బంధువులకు సమాచారం అందించామని, అతని కుమారుడు యాలాల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మరణానికి రూ. 6 వేలు

- ప్రసవానికి రూ. 3వేలు..
- ముడుపులు ఇస్తేనే బీమా డబ్బులు
- కార్మికశాఖలో ప్రతీ పనికి ఓ రేటు
- సొంతంగా వెళ్తే ఫలితం శూన్యం
- పైరవీకారుల ద్వారా వస్తేనే పనులు



కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న బాధితులు

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ పరవీ కారులకు అడ్డాగా మారింది. ఇక్కడ ఏ పని జరగాలన్నా చేతులు తడపాల్సిందే. కాసులిస్తేనే పనులు లేదంటే... ఏదో వంకతో రిజెక్ట్ చేస్తూ కార్మికులను కార్యాలయాల తిప్పుకుంటున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగీతిరిగి ఓపిక నశించిన బాధితులు మంగళవారం గద్వాల పట్టణంలోని కార్మిక శాఖ ముందు నిరసన తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన సుజాత అనే కార్మికురాలికి ఏడు నెలల క్రితం కాన్పు అయ్యింది. ఇందుకు సంబంధించి కార్మిక శాఖ నుంచి రూ. 30 వేలు రావాల్సి ఉంది. ఈ డబ్బులు రావాలంటే రూ. 3వేలు చెల్లించాలని మధ్యవర్తి అడగడంతో డబ్బులు ఇచ్చామని బాధితులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రావడంలేదు. అలాగే బింగిదొడ్డికి చెందిన గోవిందు అనే కార్మికుడు గతేడాది సెప్టెంబరు 23న మృతి చెందాడు. ఇందుకు సంబంధించి మధ్యవర్తి రూ. 6 వేలు తీసుకున్నాడు. కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 1.30 లక్షలు రాలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇలా చాలామంది కార్మికులతో మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసుకొని పనులు చేయడం లేదు. మధ్యవర్తులను కాదని నేరుగా కార్యాలయానికి వెళ్తే అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు, మధ్యవర్తులు కుమ్మక్కై కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కాన్పు చేయించుకొని 11 నెలలు అవుతోంది..

కాన్పు చేయించుకొని 11 నెలలు అవుతోంది. నేటికీ తనకు రావాల్సిన రూ.30 వేలు ఇవ్వలేదు. అధికారులకు, మధ్యవర్తులకు డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారు. తాను ఇవ్వనందుకు తనను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని అయిజ మండల కేంద్రానికి చెందిన మాల బజారమ్మ మంగళవారం కార్యాయం ముందు నిరసన తెలిపారు.

అధికారుల పేరుతో గ్రామాల్లో పర్యటన...

గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన ఓ యువకుడు కార్మిక శాఖలో ఉద్యోగినంటూ.. లేబర్ కార్డులు ఇప్పిస్తానని, మృతిచెందిన కార్మికులకు బీమా చేయిస్తానని వేలల్లో డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం అంతా కార్మిక శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే అలంపూర్ మండల కేంద్రంలో లేబర్ కార్డుల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వెళ్లగా అక్కడ ఉన్న మీసేవా నిర్వాహకులు గొడవకు దిగినట్లు తెలుస్తోంది. అయితే కార్మికశాఖలో ఉన్న ఓ అధికారికి, ఈ యువకుడికి మధ్య లావాదేవీలు ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే ఇటిక్యాల మండలం కొండేరు, ఉదండాపురం గ్రామాలలో ఈ యువకుడు ఒక్కో కార్డుకు డబ్బులు వసూలు చేసి 1000 కార్డులు తీయించినట్లు సమాచారం.

ఇక్కడ ప్రతీ పనికి పైసలివ్వాల్సిందే..

జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖలో ప్రతీ పనికి ఒకరేటు ఉంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక్కడ పనిచేసే కొందరు సిబ్బంది నేరుగా డబ్బులు వసూలు చేస్తుంటే మరి కొందరు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా డబ్బులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో కార్మికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు జిల్లా కేంద్రంలో దళారులు ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని కార్మికశాఖలో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులతో పాటు అధికారులకు కూ డా ఇందులో వాటా ఇస్తేనే పనులు చకాచకా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దళారులను ఆశ్రయించొద్దు



దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్ అన్నారు. ఆరు నెలల నుంచి ఇప్పటివరకు 1500 క్లైమ్‌లు క్లియర్ చేసాం. సరైన ధ్రువపత్రాలు లేక ఫైల్ వెనక్కి వస్తున్నాయి. దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాలి. - వేణుగోపాల్, అసిస్టెంట్ లేబర్ అధికారి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిన్నంబావి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన కాటమోని రామన్ గౌడ్ (48) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ రాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి సంపు నింపేందుకు బోర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. అతడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా యువతి...

కొత్తకోట (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండ లంలోని కానాయపల్లిలో ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. కొత్తకోట పట్టణానికి చెందిన బుచ్చిరెడ్డి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంట్లో కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుర్మ య్య, చెన్నమ్మ దంపతుల కుమార్తె బాలమణి (24) మూడేళ్లుగా కూలీ పని చేస్తుంది. మంగళవారం సాయంత్రం ఆమె మృతి చెందింది. బుధవారం ఉదయం విషయం తెలియడంతో తల్లిదండ్రులు కానాయపల్లికి చేరుకున్నారు. తమ కుమార్తె మృతికి బుచ్చిరెడ్డే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

మరికల్ (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పసుపుల గ్రామ స్టేజీ దగ్గర బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. మరికల్‌కు చెందిన శివ(30) మరికల్ నుంచి రాయిచూర్ వైపు తన బైక్‌పై వెళ్తుండగా, మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లికి చెందిన రాజు, మక్తల్ మండలం జక్లైర్ గ్రామం నుంచి పాల ఆటోలో మరికల్ వైపు వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై గ్రామస్థుల సమాచారం మేరకు ఏఎస్ఐ ఎల్లయ్య, మసూద్‌పాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తలకు బలమైన గాయాలైన ఆటో డ్రైవర్ రాజును 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

» భూమి హద్దులపై వివాదం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని కర్నె తండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నె తండాలోని సర్వే నెంబర్ 71లో పట్టాదారు జాతర నాయక్ సర్వే చేయిస్తుండగా, పక్క పొలం వారు హద్దులు చూపిస్తున్న క్రమంలో వివాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన కొడావత్ కిషన్, కొడావత్ లక్ష్మణ్, చిన్యా, లక్ష్మణ్, మాన్య, శాంతి, రమేశ్, పక్క పొలానికి చెందిన ఇస్లావత్ మాన్య, విజయ్, శ్రీను, సోమ్లా, రవి, కృష్ణల మధ్య ఘర్షణ జరిగింది. గాయపడిన వ్యక్తులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైతు కొడావత్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు.

చోరీ కేసులో యువకుడి రిమాండ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గద్వాలలో ఓ వివాహ వేడుకలో బంగారు చైన్‌ను చోరీ చేసిన నూర్‌బాషాను బుధవారం అరెస్టు చేశామని పట్టణ ఎస్ఐ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గద్వాల నదిఅగ్రహారం సమీపంలోని ఎస్వీ ఈవెంట్ హాల్‌లో వారంక్రితం (17న) వివాహ వేడుకలకు ఖమ్మం జిల్లాకు చెందిన సత్యనారాయణ హాజ రయ్యారు. ఈ సమయంలో అతని వద్ద 13గ్రాముల బంగారు చైన్ చోరీకి గురైంది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి సీసీపుటేజీల ఆధారంగా స్థానికుల విచారణ అనంతరం పోలీసులు చోరీకి పాల్పడింది. పట్టణానికి చెందిన నూర్‌బాషా అని అనుమానించారు. నిఘాపెట్టి బుధవారం జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో, కోర్టులో హాజరు పరిచి, న్యాయాధికారి ఆదేశంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సీడ్ పత్తి సబ్ ఆర్గనైజర్ అరెస్టు

మల్దకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాల నిల్వ కేసులో సబ్ ఆర్గనైజర్ శ్రీనును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మల్దకల్ ఎస్ఐ నందీకర్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం మల్దకల్ మండలంలోని కుర్తిరావులచెరువు గ్రామ శివారులోని పొలంలో నిల్వ చేసిన నకిలీ సీడ్‌పత్తి విత్తనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సబ్‌ఆర్గనైజర్ శ్రీ నును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీని వెనుక ఇంకా ఎవరైనా ఉంటే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆటాడుకుందాం...రా

» వచ్చేనెల 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

» గ్రామ స్థాయిలో 10, మునిసిపాలిటీల్లో 5 కేంద్రాలు

» పూర్తయిన శిక్షకుల ఎంపిక



శ్రీరంగాపూర్‌లోని వేసవి క్రీడా శిబిరంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ముగిసింది. వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకొనేలా, వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతోంది. ఇప్పటికే కోచ్‌ల ఎంపికను కూడా పూర్తి చేసింది. వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణా శిబిరాలు కొనసాగనున్నాయి.

ఏ ఆట ఎక్కడ?

జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో 10, మునిసిపాలిటీల్లో ఐదు క్రీడా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి ఉన్న కోచ్‌లు ఇది వరకే దరఖాస్తు చేసుకోగా ఎంపిక కూడా పూర్తయింది. మునిసిపాలిటీల్లో అవసరాన్ని బట్టి మరో రెండు శిబిరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మదనాపూర్‌లో వాలీబాల్, గోపాల్‌పేట, ఏదుల, వీపనగండ్ల గ్రామాల్లో ఫుట్‌బాల్, ఘణపూర్, అప్పరాలలో అథ్లెటిక్స్ శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే పెద్దమందడి, కడుకుంట్ల, మాందాపూర్‌లలో హాకీ, మూలమల్లలో కబడ్డీ క్రీడా శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వనపర్తి మునిసిపాలిటీలో కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, చెస్ క్రీడలలో శిక్షణ ఇచ్చేందుకు నాలుగు శిబిరాలను ప్రారంభించనున్నారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో వాలీబాల్ శిబిరం ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థులకు నెల రోజుల పాటు శిక్షణ

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం కోచ్‌లు వివిధ క్రీడా అంశాలలో తర్ఫీదు ఇవ్వనున్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాల బాలికలు తమ ఆసక్తిని శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని క్రీడా శాఖ అధికారులు కోరుతు న్నారు. క్రీడా పరికరాలను ప్రభుత్వమే సమకూర్చడంతో పాటు, ఒక్కో శిబిరం నిర్వ హణ కోసం శిక్షకుడికి రూ.4 వేలు గౌరవ వేతనం, మైదానం నిర్వహణ కోసం మరో రూ. 1000 ఇవ్వనున్నది. శిబిరాల్లో మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు, మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉంచుతారు.

సద్వినియోగం చేసుకోవాలి



క్రీడా శిబిరాల నిర్వహణకు శిక్షకుల నుంచి దరఖాస్తులను స్వీకరించాం. శిబిరాలను నిర్వహించేందుకు స్థలాల ఎంపికను పూర్తి చేశాం. వేసవి క్రీడా శిబిరాలు విద్యార్థులు తమ క్రీడా ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవడానికి చక్కగా సహాయపడతాయి. వేసవి సెలవులను సమయాన్ని వృథా చేయకుండా క్రీడలపై దృష్టి సారిస్తే ఉత్తమ క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

- సుధీర్ కుమార్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన

» ఎన్ఎంసీ ప్రత్యేక పరిశీలకులు డా. రవికుమార్



నూతన పద్ధతులతో విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధ తులను అనుసరించి విద్యార్థులకు బోధన చేయాలని జాతీయ విద్యామండ లి(ఎన్ఎంసీ) ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ వైద్యకళాశాలలో మూడు రోజుల బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ వైద్యమండలి వైద్య విద్యలో కొత్తగా కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఈ విధానం ద్వారా విద్యాబోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో మెళకువలపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ విద్యా విధానం విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని, అధ్యాపకుల పదోన్నతులకు కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఈ అంశంపై అవగాహన పెంచుకొని వైద్యవిద్యలో మార్పులు తీసుకురా వలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్, ఎంఈయూ కోఆర్డినేటర్ ఉషారాణి, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌ప్రకాశ్, ఆయా విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అక్షయకు ఘన సన్మానం

» ఇంటర్ 'ప్రథమ' పరీక్షల్లో స్టేట్ ఫస్ట్

» అభినందించిన కలెక్టర్, ఎమ్మెల్యే



అక్షయను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

దామరగిద్ద, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో అత్యుత్తమ ఫలితం సాధించిన విద్యార్థిని అక్షయను నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఘనంగా సన్మానించారు. దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన చెన్నారం అక్షయ హైదరాబాద్‌లోని వాలివోక్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతోంది. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 469/470 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఆమె తల్లిదండ్రులు విజయ, వెంకటప్పలను వేదికపైకి పిలిచి అభినందించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి, జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, ఏఎంసీ డైరెక్టర్ వెంకటప్ప, ఎంపీడీవో సాయిలక్ష్మి, తహసీల్దార్ జమీల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఖాజా, లక్ష్మణ్, ఆనంద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా మహబూబ్‌నగర్

» ప్రకటించిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌ను మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా ప్రకటించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మాన్యువల్ స్కావెంజర్స్ జిల్లా స్థాయి సర్వే కమిటీ సమావేశాన్ని గత నెల 27న కలెక్టర్ అధ్యక్షతన ఐడీవోసీ కాంప్లెక్స్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. కమిటీ విధి విధానాలకు సంబంధించి గ్రామ, పట్టణ స్థాయి, రైల్వేలు తదితర సంస్థలలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 7 వరకు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజింగ్ ఎక్కడా లేదని ఆ నివేదికలో పేర్కొన్నట్లు వెల్లడించారు. అయితే ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు సెల్ఫ్ డిక్లరేషన్‌కు సమయం ఇచ్చిందని, కానీ తాము స్కావెంజింగ్ చేస్తున్నట్లు ఎవరూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ఫిర్యాదు చేయలేదు కనుక పాలమూరును మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా ప్రకటించినట్లు తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఏఈ ఏసీబీ అధి కారులకు పట్టుబడ్డాడు. ఖిల్లాఘణపూర్ మం డలం టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కొండయ్య బుధవారం వనపర్తి డీఈ కార్యాల యంలో ఓ వ్యక్తి నుంచి రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రె డ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్‌నగ ర్ ఏసీబీ డీఎస్పీ సిహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఖిల్లాఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో నిర్మించిన తిరుమల ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 160 కేవీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏఈ కొండయ్య లంచం డిమాం డ్ చేశాడు. ఇదే పని కోసం గతంలో కూడా రూ. 30 వేలు తీసుకున్నాడు. ప్రస్తుతం రూ. 20 వేలు డిమాండ్ చేయగా, రూ. 10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ డబ్బులు తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏఈ కొండయ్య డబ్బు తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యిందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయనను అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. అధికా రులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు.

ప్రారంభమైన స్కానింగ్ సేవలు

» గర్భిణులకు తగ్గిన ఆర్థిక భారం » ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు పునఃప్రా రంభమయ్యాయి. ఆసుపత్రిలో రేడియా లజిస్టు లేకపోవడంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు స్కానింగ్ కోసం ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించి ఆర్థిక భారం మోయాల్సి వచ్చింది. ఈ సమస్యపై గత నెల 27న 'గర్భిణులపై స్కానింగ్ భారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అందుకు వైద్యశాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి ఇద్దరు ఎస్ఆర్ (సీనియర్ రెసిడెంట్) రేడి యాలజిస్టులను నియమించారు. త్వరలోనే వైద్యులతో సమావేశం నిర్వహించి, వచ్చే నెల నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు, మాతా శిశు సం రక్షణ కేంద్రంలో స్కానింగ్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసు కొస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు తెలిపారు.



వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులకోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



అయిజలో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

సెలవులొచ్చేశాయ్

పరీక్షలు ముగిశాయి.. వేసవి సెలవులు వచ్చేశాయి.. ఈనెల 23 నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు బుధవారం ఇంటి బాటపట్టారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి తమ పిల్లలను బస్సులు, ప్రైవేటు వాహనాల్లో స్వగ్రామాలకు తీసుకెళ్లారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా మారాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి (ఆంధ్రజ్యోతి)/ నారాయణపేట/ అయిజ



వనపర్తి పట్టణంలోని మర్రికుంట నుంచి ఇంటి బాట పట్టిన విద్యార్థి



నారాయణపేటలో బడికి టాటా చెప్తున్న విద్యార్థులు



పేట ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థినులు





వనపర్తి పట్టణం నుంచి ఇంటి బాట పట్టిన విద్యార్థులు

న్యూస్ బాక్స్

అంబలి కేంద్రం ప్రారంభం

మరికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పంపల్లి గ్రామ స్టేజీ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలన్న గారి మోహన్‌రెడ్డి స్వచ్ఛందంగా నిర్వహించిన అంబలి, చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబలి కేంద్రాన్ని బాటసారులు, వాహనదారులు, రైతులు వినియోగించుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీశ్, నారాయణరెడ్డి, భూనీడు వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం గొల్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శాన్విక, క్షోత్ర అభిలాష్, అపర్ణ, స్పందన, లావణ్య, గోపిక, వెన్నెలకు బంగారు, సిల్వర్ మెడల్స్‌తో పాటు ప్రతిభా పురస్కారాలను హెచ్‌ఎం శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రగతి నమోదు పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీకాంత్, ఇందిర పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి హేయమైన చర్య

మక్తల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసి చంపడం హేయమైన చర్య అని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్‌సాగర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు తర్వాత పర్యాటకుల సందడి పెరిగిందని, అభివృద్ధిని చూసి ఓర్వలేక ఒక మతానికి చెందిన వారిని టార్గెట్ చేస్తూ చంపేయడం దుర్మార్గమన్నారు. నరమేధం సృష్టిస్తున్న పాక్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పర్యాటకుల మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శివకుమార్, భరత్ సాగర్, రామకృష్ణ, విజయ్, పృథ్వి, అనిల్, రాజు పాల్గొన్నారు.

మతోన్మాద ఉగ్రవాదులను ఉరి తీయాలి

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ప్రాంతంలోని పహల్గాంలో పర్యాటకులపై జరిపిన కాల్పులతో మారణహోమాన్ని సృష్టించిన మతోన్మాద ఉగ్రవాదులను ఉరి తీయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటకులపై మతోన్మాదులు జరిపిన కాల్పులను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు ఆయన సంతాపాన్ని తెలిపారు.

ఉగ్ర దాడి హేయమైన చర్య

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్లో పర్యాటకులపై తుపాకులతో తెగ బడి 28 మంది అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నారాయణపేట సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు చేశామని, ఇక ఉగ్రవాదులే లేరని ఉపన్యాసాలతో దేశ ప్రజలను మభ్యపెడుతున్న కేంద్ర పాలకవర్గం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్నారు. ఉగ్రవాద దాడి హేయమైన చర్య అని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు గోపాల్, బాల్‌రామ్ ఉన్నారు.

ఆశన్‌పల్లిలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

దామరగిద్ద, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆశన్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులైన విద్యార్థులు పాటల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, సదానందం, హనుమంతు, ఉపాధ్యాయులు లచ్చిరాం, ఆనంద్, మహేష్, శారద, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్

మక్తల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కోలాటం, నృత్య ప్రదర్శన, డ్రాయింగ్, వ్యాసరచన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రోగ్రెస్ కార్డులు అందించారు. విద్యార్థుల్లో ఏకత్వం కల్పించడం, సంప్రదాయాలు, భాష పట్ల గౌరవం పెంచడం ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్ ముఖ్య ఉద్దేశమని హెచ్‌ఎం నాగేశ్వరయ్య తెలిపారు. ఉపాధ్యాయులు సుధీర్, ప్రసన్న, రేణుక, జయశ్రీ, సుభాసిని, గీత, విజయలక్ష్మీ, పరంజ్యోతి పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే 'భూభారతి'

- ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్
- దామరగిద్ద, ధన్వాడలలో అవగాహన సదస్సు



ధన్వాడ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, వేదికపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు

దామరగిద్ద/మరికల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూసమస్యల పరిష్కారానికే భూభారతి కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం దామరగిద్ద మండల కార్యాలయ ఆవరణలో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొని, మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించిందన్నారు. ప్రస్తుతం కొత్త చట్టం ద్వారా చిన్నచిన్న భూసమస్యలు తహసీల్దార్ స్థాయిలో పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. అక్కడ కాకుంటే ఆర్డీవో స్థాయిలో పరిష్కారానికి అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా పెద్ద సమస్యలు ఉంటే జేసీ, కలెక్టర్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఐదేళ్లుగా ఒక్క సాదాబైనమా పరిష్కారం కాలేదని, కొత్త చట్టం ద్వారా సాదా బైనమాలు పరిష్కరించుకొనే అవకాశం ఉందన్నారు.

జూన్ 2 నుంచి ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు

భూసమస్యల పరిష్కారానికి జూన్ 2 నుంచి ప్రతీ రెవెన్యూ గ్రామంలో సదస్సు నిర్వహించి భూసమస్యలు పరిష్కరించి, రైతుల ఇబ్బందులు తీరుస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అధికారులే రికార్డులతో గ్రామానికి వచ్చి సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తారని, చిన్న సమస్యలు ఉంటే అక్కడే పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, తహసీల్దార్ జమీల్, ఎంపీడీవో సాయిలక్ష్మి, బాల్‌రెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, రఘు, ఖాజామియా, ఆనంద్, వెంకటప్ప, లక్ష్మణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంతకుముందు ధన్వాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సింధూజ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో పాటు, కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై, మాట్లాడారు. ముందుగా భూభారతి చట్టం అమలు, అందులోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం ధరణి స్థానంలో తెచ్చిన, భూభారతి చట్టం రికార్డులో తప్పులు, సవరణలకు అవకాశం ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి, మాధవరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

మహనీయులను అవమానించొద్దు

- జైబాపు జైభీమ్ జైసంవిధాన్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట న్యూటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జైబాపు జైభీమ్ జైసంవిధాన్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం ఆధ్వర్యంలో పట్టణంలోని ఒకటవ వార్డు అవధూత మఠం నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ మహనీయులైన మహాత్మాగాంధీ, అంబేడ్కర్ జీవిత చరిత్రలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన బాపూజీని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అసత్య ప్రచారాలతో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని గుర్తు చేస్తూ రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అంతకుముందు బాపూజీ, అంబేడ్కర్ చిత్రపటాలను చేతిలో పట్టి సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, వకీల్ సంతోష్, మహ్మద్‌నజీర్ తదితరులున్నారు.

పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి



కృష్ణలో కార్మిక ర్యాలీ, బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

దామరగిద్ద/కృష్ణ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ కోరారు. బుధవారం దామరగిద్ద మండల కేంద్రంతో పాటు కంసాన్‌పల్లి గ్రామంలో పర్యటించి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈనెల 26, 27 తేదీల్లో మరికల్‌లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాలు జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అలాగే, ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600, సంవత్సరంలో 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభలో ప్రజలు, ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జోషి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, భాస్కర్, వడ్డె మల్లేష్, గోవిందు, నర్సిములు, శరణబస్సప్ప, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అదేవిధంగా, మరికల్‌లో ఈనెల 26, 27వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. బుధవారం కృష్ణ మండల కేంద్రంతో పాటు హిందూపూర్, గుడెబల్లూరు తదితర గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు, సురేష్, రాజు, అంజప్పశెట్టి, శివప్పశెట్టి, వెంకటేష్, పంతికి వెంకటేష్, ఎల్లప్ప, పల్లె నర్సప్ప, నరసప్ప, ఎస్ఎఫ్ఐ నాయకుడు నయూబ్ తదితరులున్నారు.

ముగిసిన విద్యా సంవత్సరం

- విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాల అందజేత
- ముగింపు రోజు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం



పేట శివాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులు అందిస్తూ..

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరం బుధవారం చివరి రోజుతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థుల ప్రతిభను తెలిపే ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు ఉపాధ్యాయులు అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, పరీక్షల నిర్వహణ ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్ నేతృత్వంలో ఇదివరకే పాఠశాలల విద్యార్థులకు ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించి నిర్మాణాత్మక, సంగ్రహనాత్మక ఫలితాలు వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ ప్రగతి కార్డులను విద్యార్థులకు చివరి ముగింపు రోజు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి వారి సమక్షంలో ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందించారు. గురువారం 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ఆరంభమై జూన్ 12న 2025-26 నూతన విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 335, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు 85, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 75, కస్తూర్బాలు 11, మోడల్ స్కూల్స్ 3 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వారీగా మొత్తం 82,932 మంది విద్యార్థులు ఉండగా అందులో బాలురు 42,414 ఉండగా బాలికలు 40,518 మంది ఉన్నారు.



మక్తల్ మండలం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతిభా పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే అందేలా చర్యలు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మద్దూర్ పర్యటనలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి సమీక్ష ముగించుకొని వెళ్తున్న సందర్భంగా లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం మద్దూర్‌లో కొనసాగుతున్న పీఏసీఎస్ నూతన భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత పాటించేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.

నేడు తెలంగాణ భూభారతి చట్టంపై అవగాహన

నర్వ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గురువారం మధ్యాహ్నం 2 గంటలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. కార్యక్రమానికి రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని, ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రానున్నారని ఆయన పేర్కొన్నారు.

నేడు అంగన్‌వాడీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం నారాయణపేట కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రామ్‌లు బుధవారం తెలిపారు. ఎండలు అధికంగా ఉండడం వల్ల మే నెలలో అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించాలన్నారు. ధర్నాలో అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వార్డు కమిటీల ఎన్నికలకు శ్రీకారం

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీల ఎన్నికకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేటలోని 24 వార్డుల్లో పార్టీ వార్డు కమిటీల ఎన్నికకు మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, సుధాకర్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, నాయకులు మనోహర్‌గౌడ్, సంతోష్‌కుమార్, గందె చందకాంత్, సీనియర్ నాయకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కొత్త కమిటీలు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. రోజుకు రెండు వార్డు కమిటీలతో 12 రోజుల పాటు కమిటీల ఏర్పాటు ప్రక్రియ జరగనుంది.

ఒకటవ వార్డు కమిటీ ఎన్నిక

నారాయణపేట ఒకటవ వార్డు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మసి పవన్, ఉపాధ్యక్షుడిగా దేవసుగుర్ కృష్ణ, మహ్మద్ మజిద్, ప్రధాన కార్యదర్శిగా రవి, కార్యదర్శిగా బాల్‌రెడ్డి, బోగం శ్రీను, బాల్‌రాజ్, క్రియాశీల సభ్యులుగా బండి గోపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, గజ్జలి బాలప్ప, సరాఫ్ నాగరాజ్ ఉన్నారు.

పాఠశాలకు రూ.21,116 విరాళం

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాలకు పేరపళ్లకు చెందిన భద్రాద్రి రామయ్య ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ తన తల్లిదండ్రులు జయశ్రీ, వెంకట్రాములు చేతులమీదుగా రూ.21,116 విరాళాన్ని హెచ్‌ఎం భీమేశ్వరికి అందించారు. తపస్ నాయకుడు నరసింహ, అశోక్‌కుమార్, రాములు, రమేష్, రాధిక, సతీష్ ఉన్నారు.

ఉల్లిగడ్డల క్రయవిక్రయాల జోరు

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిగడ్డల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగాయి. క్వింటాల్ గరిష్ఠ ధర రూ.1600 పలుకగా కనిష్ఠంగా రూ.1000 పలికింది. అలాగే వివిధ గ్రామాల నుంచి జొన్నలు, వేరుశనగ, కందిని విక్రయించేందుకు తీసుకువచ్చారు.

పేట జిల్లా న్యాయాధికారిగా శ్రీనివాస్



జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్‌కు మొక్కను అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ తదితరులు

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయాధికారిగా నియామకమైన బోయ శ్రీనివాస్‌కు బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బదిలీల్లో భాగంగా మంచిర్యాల నుంచి నారాయణపేట జిల్లా కోర్టుకు వచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందునామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి జిల్లా న్యాయాధికారికి మొక్కను అందించి, స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో



డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన జయచంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజ, సిబ్బంది

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారిగా జయచంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జయచంద్ర మోహన్ జనరల్ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ పనిచేస్తున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మిపై అవినీతి ఆరోపణలు రావడంతో కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులో ఆదేశించింది. ప్రస్తుతం డీఎంహెచ్‌వోగా జయచంద్రమోహన్‌ను నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించగా డిప్యూటీ డీఎంహెచ్‌వో శైలజ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. వెంట సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : ఎస్పీ

నారాయణపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ యోగేష్‌గౌతమ్ బుధవారం హెచ్చరించారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీ ప్యాకింగ్ లేబుల్ చూసుకొని కొనాలన్నారు. విడి విత్తనాలు ప్రమాదకరమన్నారు. గ్రామాల్లోకి వచ్చి విడి విత్తనాలు అమ్మే వ్యాపారులు, దళారుల నుంచి కొనుగోలు చేసుకొని మోసపోవద్దన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం విత్తన సంస్థలు, డీలర్ల బాధ్యత అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అందకుండా చూడాలన్నారు. విత్తన కేసులతో సంబంధం ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసులకు డయల్ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు సైతం సమాచారం ఇవ్వాలన్నారు.

చెక్‌పోస్టు వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్టు వద్ద వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ కృష్ణంరాజు

మక్తల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో నారాయణపేట జిల్లాలోకి పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా ఉండేందుకు ఊట్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ బార్డర్ సమస్తాపూర్ చెక్‌పోస్టు వద్ద ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణంరాజు మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండి కర్ణాటక నుంచి జిల్లాలోకి ధాన్యం రాకుండా చూడాలన్నారు. వాహనాల నెంబర్లు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వేసవిలో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు రోజుకు నాలుగు గంటలు చదువుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం భారతి అన్నారు. బుధవారం మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులచే సెలవుల్లో తెలుగు, ఆంగ్ల పుస్తకాలను చదివించడం, రాయించడం చేయాలన్నారు. వార్తా పత్రికలు, గణితంలో ఎక్కాలు, చతుర్విధ ప్రక్రియలు, సమస్యలను సాధింపజేయాలన్నారు. విద్యార్థులను ఎండలో బయటకు పంపొద్దన్నారు. రాబోయే విద్యాసంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ చేయించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను అందజేశారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మణెమ్మ, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, భానుప్రకాశ్, లక్ష్మణ్, ప్రతాప్, మంగళ, నిర్మల, శశిరేఖ, శిరీష, శ్రీదేవి, నరసింహా, వెంకటేశ్ ఉన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీ



కోస్గిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని నాయకులు

కోస్గి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ మృతులకు సంతాపం తెలుపుతూ బుధవారం కోస్గి పట్టణంలో హిందూవాహిని నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామాలయం చౌరస్తా నుంచి వివేకానంద చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం హిందూవాహినీ కార్యకర్తలు మాట్లాడుతూ కశ్మీర్‌లో హిందూ పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి పిరికిపంద చర్య అని దేశంలో మత చిచ్చు పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. దాడిలో చనిపోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని వారు కొవ్వొత్తులు వెలిగించారు. భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనను బలోపేతం చేస్తాం



డాక్టర్ మణికంఠగౌడ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరుతున్న యువకులు

మక్తల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని ఆ పార్టీ మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మణికంఠగౌడ్ అన్నారు. బుధవారం జనసేన సిద్ధాంతాలు నచ్చి 50 మంది జనసేనలో చేరారన్నారు. మక్తల్ నియోజకవర్గంలో పవన్ అభిమానులతో కలిసి గ్రామగ్రామాన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కలాల్ రామన్‌గౌడ్, దండు బాల్‌రెడ్డి, రాము, రామలింగప్ప, ఆనంద్, బొంబాయి నాగేష్, గోపాల్, వాకిటి తాయప్ప, కిష్టయ్య తదితరులున్నారు.